క్లుప్తంగా

ఘనంగా గోదాదేవి కల్యాణం



సంపరలో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

పెదపూడి: ధనుర్మాసం చివరి రోజు సందర్భంగా మండలంలోని పెద్దాడలో గోదాదేవి సమేత అభినవ వేంకటేశ్వరస్వామి, సంపర వేంకటేశ్వరస్వామి ఆలయంలో రంగనాథస్వామి, పెదపూడిలో జనార్దనస్వామి ఆలయాల్లో గోదాదేవి కల్యాణం ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంపరలో ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విజయదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గమ్మ అమ్మవారు

బిక్కవోలు: మండలంలోని కొంకుదురులో విజయదుర్గమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. దాతల సహకారంతో అన్న సమారాధన చేశారు. కొంకుదురు, పందలపాక, ఊలపల్లి, కొంకుదురు సావరం గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

విజేతలకు బహుమతుల అందజేత

బిక్కవోలు: సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలోని ఇలపల్లిలో మహిళలకు ముగ్గుల పోటీలు ఆదివారం నిర్వహించారు. అనంతరం విజేతలకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలోని సర్పంచ్ లొల్లం భద్రం, సాధనాల రాంబాబు, నక్కా వీరబాబు, వైఎస్సార్ సీపీ మండల జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

రంగంపేట: మండలంలోని కోటపాడులో సత్యసాయి సేవా సదన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరాన్ని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్‌నాథ్ ఆదివారం ప్రారంభించారు. రాజమహేంద్రవరం శ్యామ్ హోమియో కేర్ డాక్టర్ శ్యామ్‌కుమార్ సుమారు 50 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాదళ్ సభ్యులు నర్ల శ్రీనివాస్, సిరిగిన వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



రామచంద్రపురంలో పేద విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న దృశ్యం

సీతానగరం: రామచంద్రపురంలో ఘంటసాల మానవ సేవయే మాధవ సేవ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. భోగి పండగ సందర్భంగా రామచంద్రపురానికి చెందిన సాయి సూర్య నిర్మాణ్ వ్యవస్థాపకులు, బిల్డర్ కోడేబత్తుల సత్యేంద్రకుమార్(నాని) సహాయ సహకారాలతో ఘంటసాల మానవసేవయే మాధవసేవ సంస్థ అధ్యక్షుడు యూవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, సెక్రటరీ చెరుకూరి ఉదయ భాస్కర్, కోశాధికారి ఎస్.కృష్ణారావు ఆధ్వర్యంలో రామాలయం వద్ద సంగీత విభావరి నిర్వహించారు. అనంతరం గ్రామంలోని 10 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో 109 ఏళ్ల వయసు గల ఉద్దగిరి కనకదుర్గను ఘనంగా సత్కరించారు.

సంస్కృతీ సంప్రదాయాలు పరిరక్షించాలి



జి.మామిడాడలో కుర్చీలాట ఆడుతున్న మహిళలు

పెదపూడి: గ్రామీణ ప్రాంతాల్లో సంస్కృతీ సంప్రదాయాలను అందరూ పరిరక్షించి, ప్రోత్సహించాలని ఫ్యామిలీ హెల్త్ క్లబ్ ముఖ్య సలహాదారుడు మండ రాజారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీసూర్య లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. యువతకు స్లోసైక్లింగ్, టగ్ ఆఫ్ వార్, మహిళలకు ముగ్గులు, కుర్చీలాట పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలకు క్లబ్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి బహుమతులు అందజేశారు. పోటీలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

పల్లెల్లో సంక్రాంతి సంబరాలు

- తొలిరోజు భోగి పండగతో వేడుకలు ప్రారంభం
- ఆలయాల్లో పూజలు
- వైభవంగా గోదాదేవి కల్యాణం



రఘుదేవపురంలో వేసిన భోగి మంటలు



భోగి మంటలో పిడకల దండను వేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



దోమాడలో వేసిన భోగి మంట



అనపర్తి ఇందిరానగర్‌లో ప్రజ్వరిల్లుతున్న భోగి మంట

రాజానగరం: సంక్రాంతి సంబరాలు ఆదివారం ఆనందోత్సాహాలతో, సంప్రదాయబద్ధంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. తొలి రోజైన భోగి పండగను వేకువజామునే భోగి మంటలతో వేడుకగా నిర్వహించారు. పిల్లలు, పెద్దలు తేడా లేకుండా వేకువజామునే లేచి, తలారా స్నానమాచరించి, అప్పటికే సిద్ధం చేసుకున్న కలప, ఇతర సామగ్రితో భోగి మంటలు వేసి, గోపిడకలతో తయారు చేసిన దండలను ఆ మంటలతో వేసి, ఉల్లాసంతో కేరింతలు కొట్టారు. వీధివీధుల్లో కూడలి ప్రాంతాలలోను, ఆలయాల వద్ద ఈ భోగి మంటలు వేడుకగా దర్శనమిస్తున్నాయి. సాయంత్రం వేళలో పెద్దలు తమ చిన్నారులకు రేగుపళ్లతో కూడిన పుష్పాలను భోగిపండ్లు వేసి, ఆశీస్సులందజేశారు.

రాజానగరంలోని పురాతన ప్రసిద్ధి చెందిన రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి, రాజరాజేశ్వరీదేవి ఆలయాల అర్చకుల ఆధ్వర్యంలో గ్రామంలో మూడు రోజుల పాటు జరిగే గ్రామోత్సవం కూడా భోగి పండగతో ప్రారంభించారు.

ఊరంతా పండగ.. మనసంతా నిండుగా..

బిక్కవోలు: సంక్రాంతి సంబరాలతో పల్లెలు కళకళలాడుతున్నాయి. పట్టణాల్లో ఉన్న పల్లెవాసులు పండగ సందర్భంగా సొంత గ్రామాలకు చేరుకోవడంతో పల్లెల్లో ఇంటింటా సందడి నెలకొంది. వీధివీధినా పండగ కళ ఉట్టి పడుతోంది. బిక్కవోలు మండలం పందలపాకలో చిన్నారులు గత పది రోజులుగా సేకరించిన కలప, పిడకలతో ఆదివారం తెల్లవారుజామునే భోగి మంట వేశారు. మండలంలో హరిదాసుల హరినామ కీర్తనలతో వీధులు సందడిగా ఉన్నాయి. కొంకుదురులో మహిళలు పోటీపడి మరీ తమ ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేశారు.

పిండివంట తయారీలో బిజీబిజీ

సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామాల్లో ఇంటింటా పిండి వంటలు ఘుమఘుమలాడుతున్నాయి. అరిసెలు, సున్నుండలు, బొబ్బట్లు, పోకుండలు, గజ్జికాయలు, బెల్లం మిఠాయి, లడ్డూలు, జంతికలు, పూతరేకులు తదితర రకాల పిండి వంటలను మహిళలు తయారు చేస్తున్నారు.

పెదపూడి: మండలంలో పెదపూడి, పెద్దాడ, జి.మామిడాడ, రామేశ్వరం, ఏపీత్రయం, కరకుదురు, సంపర, కాండ్రేగుల, శహపురం, గండ్రేడు, పుట్టకొండ, కుమారప్రియం, చింతపల్లి, వేండ్ర, పైన, రాజుపాలెం, దోమాడ, కైకవోలు తదితర గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాలతో భోగి వేడుక చేసుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ప్రజలు భోగి మంటలు వెలిగించారు. చిన్నారులు, పెద్దలు మంటలను ఉత్సాహంగా వెలిగించారు.

రంగంపేట: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఇంటింటా అందమైన రంగవల్లులు వేసి వాటిలో గొబ్బెమ్మలు అందంగా అలంకరించి తెలుగు సంప్రదాయాన్ని తెలియజెప్పారు. గ్రామాల నడిబొడ్డున పొలాల్లో వంట చెరకు తెచ్చి వేకువజామునే భోగి మంటలు వేశారు. రంగంపేటలో భోగి మంటల చుట్టూ భక్తులంతా హరినామ సంకీర్తనతో ప్రదర్శన నిర్వహించారు.

భోగ భాగ్యాలు కలగాలని...

అనపర్తి: తెలుగు ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకునే పండగ సంక్రాంతి. వెలుగులు పంచే సంక్రాంతి పండగ వచ్చి పల్లె సీమలకు నవకాంతిని తెచ్చింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం భోగి పండగను ఊరూరా, ఇంటింటా ప్రజలు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా గ్రామల్లోని పలు కూడళ్ల వద్ద భోగి మంటలు వెలిగించారు. ప్రజలు వేకువజామునే కొత్త బట్టలు ధరించి భోగి మంటల చుట్టూ తిరుగుతూ భోగి పిడకలు వేశారు. భోగి పండగను పురస్కరించుకుని గ్రామాల్లోని వీధులు, వాకిళ్లు రంగురంగుల రంగవల్లులతో కళకళలాడాయి.

ఆయా గ్రామా ఆలయాల్లో స్వామివారిని దర్శించారు. మండల గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. ప్రతి ఇంటా బంధువులతో కిటకిటలాడుతూ సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకొంటున్నారు.

ఘనంగా భోగి పండగ

సీతానగరం: గ్రామాల్లో ఆదివారం భోగి పండగను ఘనంగా జరుపుకొన్నారు. సెంటర్లలో పెద్ద పెద్ద దుంగలతో భోగి మంటలు వేశారు. ఆవు పిడకల దండలను మంటల్లో వేసి భోగి పండుగను ఘనంగా జరిపారు. స్థానిక ప్రజలు వేకువజామున లేచి పుణ్య స్నానాలాచరించి

తెలుగు సంస్కృతికి ప్రతిబింబం సంక్రాంతి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: సంక్రాంతి పండగ తెలుగు సంస్కృతికి ప్రతిబింబమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామ దేవత శ్రీవీరుళ్లమ్మవారి జాతర, భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో మరుగున పడుతున్న తెలుగింటి ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, పండగుల ప్రాధాన్యతను, విశిష్టతను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టార్ మహిళ, వంటల పోటీ, చిన్నారులకు క్యాట్ వాక్ షో తదితర పోటీల్లో విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

- గుర్తించలేని వారే విమర్శలు చేస్తున్నారు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా



వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే రాజా

రాజానగరం: రాష్ట్రంలో గ్రామ/వార్డు వలంటీర్ల సేవలు వెలకట్టలేనివని, వాటిని గుర్తించలేని గుడ్డి వారుగా ప్రతిపక్షాలు వారిపై లేనిపోని విమర్శలు చేస్తున్నాయని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని తూర్పుగానుగూడెం, నరేంద్రపురంలలోని గ్రామ వలంటీర్లను ఎమ్మెల్యే ఆదివారం సన్మానించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా, నిబద్ధతతో లబ్ధిదారులకు సకాలంలో అందజేస్తూ, దేశవ్యాప్తంగా పలువురి మన్ననలను వలంటీర్లు అందుకుంటున్నారన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేకపోతున్న ప్రతిపక్షాలు ఈర్ష్యతో వలంటీర్లపై లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. అయితే ఎవరు ఎటువంటి వారే ప్రజలకు తెలుసని, తమకు మేలు చేస్తున్న వారిని ఏనాటికీ మరచిపోరన్నారు. తూర్పుగానుగూడెం వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు చల్లా వెంకట్, శిరీష దంపతుల ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లను, యానిమేటర్లని కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించి, నూతన దుస్తులు బహూకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కురెళ్ల వెంకటేశ్వర్రావు, అబ్బిరెడ్డి వెంకటేశ్వర్రావు, పెదిరెడ్డి శ్రీను, తోట బాబూరావు, చొల్లంగి శ్రీను, పెంకే పద్దరాజు, కొండపల్లి దుర్గారావు, గొడ్డి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: వెలుగుబందలో ఆదివారం నిర్వహించిన గోదాదేవి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాదేవి కల్యాణోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. ధనుర్మాసం, సంక్రాంతి సంబరాలలో గోదాదేవి, శ్రీరంగనాథుల కల్యాణోత్సవాన్ని జరుపుకోవడం ఆనందకరమన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు వాడ్రేవు శ్రీనివాస్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలలో భాగంగా రాజానగరంలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. జి.యర్రంపాలెంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు జరిగాయి

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



1986-87 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో 1986–87 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే స్కూల్లో కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకొని ఒక్కరికొకరు తెలుసుకొని రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఆ నాడు ఒకే స్కూల్లో చదువుకున్న వీరంతా ఇప్పుడు కొంతమంది ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారులు, వ్యవసాయదారులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకులుగా ఉన్నారు. వీరు గత స్మృతులను తలచుకొని కేరింతలు కొట్టారు. అనంతరం అప్పటి గురువులు తొమ్మిది మందిని ఘనంగా సన్మానించారు. అనంతరం సహభంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కాజా మోహన్, ఈడుపుగంటి సత్యనారాయణ, బైర్రాజు శ్రీనివాసరాజు, బైర్రాజు సుబ్బరాజు, కోసూరి సత్యవతి, గద్దె రమాదేవి తదితరులు పాల్గొని సందడి చేశారు.


చిన్నారులకు ఆటల పోటీలు



కోటపాడులో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రంగంపేట: మండలంలోని కోటపాడులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడోత్సవాల్లో భాగంగా చిన్నారులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలకు లెమన్ స్పూన్, పరుగు పందెం, గోనె సంచులతో నడవడం తదితర ఆటల పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందజేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్‌నాథ్ సత్యసాయి విగ్రహానికి, పాదుకలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో సాయి నామ స్మరణ చేస్తూ విద్యార్థులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో కందర్ప రాంబాబు, పోతుల సాయికృష్ణ ప్రసాద్, నర్ల శ్రీనివాస్, చిక్కాల వెంకటేశ్వర్లు, కర్రి రమేష్, జీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు



టోర్నమెంట్ విజేతైన సంపర జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ముక్తేశ్వరరావు

పెదపూడి: క్రీడలతో క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కాకినాడ సిటీ నియోజకవర్గ పరిశీలకుడు అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. సంపరలో కె.సోమశేఖర్ అయ్యప్ప(ధోని) క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా బహుమతి ప్రదానోత్సవం ఆదివారం సాయంత్రం జరిగింది. సంపర, పెద్దాడ గ్రామాల జట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సంపర జట్టు విన్నర్‌గా, పెద్దాడ జట్టు రన్నర్‌గా నిలిచాయి. విజేతలకు ముక్తేశ్వరరావు చేతుల మీదుగా ట్రోఫీని అందజేశారు. గత ఆరు రోజులుగా మండల స్థాయిలో జరిగిన పోటీల్లో 14 జట్లు తలపడ్డాయి. టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ కె.దుర్గ, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా గోల్డ్‌బాబు, బెస్ట్ బౌలర్‌గా కె.దుర్గ, బెస్ట్ క్యాచర్‌గా వై.వెంకటేష్‌లను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.